ట్రాఫికర్

- రోడ్లపైనే అక్రమ పార్కింగ్‌లతో తీవ్ర ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయే తప్పా తగ్గడం లేదు. విస్తరణకు నోచుకోని రోడ్లపైనే అక్రమ పార్కింగ్‌ల కారణంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లపై సైతం ట్రాఫిక్ సమస్య తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. మెహిదీపట్నం, రేతిబౌలి రింగ్ రోడ్డు, టోలిచౌకి చౌరస్తా, షేక్‌పేట్ నాలా-టూంబ్స్ రోడ్డు చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. పలుమార్లు పెద్ద సంఖ్యలో వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్ దాటిని కంట్రోలు చేయలేక ట్రాఫిక్ పోలీసులు చేతులెత్తేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు..

- గోల్కొండ బంజార దర్వాజ, షేక్‌పేట్ నాలా, నానల్‌నగర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా వాహనాలు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారు.
- రోడ్డు పక్కన ఉన్న రెస్టారెంట్లు, మాల్స్ కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పాడుతుంది. షేక్‌పేట్ కొత్త ఫ్లై ఓవర్ వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న షాపింగ్ మాల్స్‌కు భవనాలలో పార్కింగ్ సౌకర్యం లేదు.
- రెస్టారెంట్ల వారు సెక్యూరిటీ గార్డులను పెట్టి మరీ రోడ్లపైనే అక్రమ పార్కింగ్‌ను చేయిస్తున్నారు.
- రేతిబౌలి చౌరస్తా, నానల్‌నగర్, పాత ముంబై జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో రోడ్డను ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకుల వద్ద సైతం వాహనాలు రోడ్ల మీదనే ఉంటున్నాయి.
- ట్రాఫిక్ పోలీసులు సాయంత్రం పూట వచ్చే అక్రమంగా పార్కింగ్ చేసి ఉన్న వాహనాలకు చలాన్లు వేస్తున్నారే తప్పా అక్రమ పార్కింగ్ నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు.



గోల్కొండ బంజార దర్వాజ వద్ద ట్రాఫిక్ జామ్

అక్రమ పార్కింగ్‌ల అడ్డాలు ఇవే....

- టోలిచౌకి రాఘవేంద్ర హోటల్
- బృందావన్ కాలనీ మోడ్రన్ కేఫ్
- షాగౌజ్ హోటల్
- మెహిదీపట్నం హసన్ కేఫ్
- మెహిదీపట్నం ప్రిన్స్ హోటల్
- టూంబ్స్ చౌరస్తా నవాబీ లిబాస్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



తనకు వచ్చిన ఫిర్యాదులను ఫోన్‌లో వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి తాను దేనికైనా సిద్ధమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆయన నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎమ్మెల్యేలో భాగంగా గురువారం ఆయన తనకు వచ్చిన ఫిర్యాదులను విన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడుతూ.. ప్రతి చిన్న సమస్యలను సైతం తాను సీరియస్‌గా తీసుకుని అది పరిష్కారమయ్యే వరకు విశ్రమించనన్నారు. ఫిర్యాదులు విన్నవించుకోవడానికి తనవద్దకు రాలేని వారు ఫోన్‌లో తనకు వారి సమస్యలను తెలపవచ్చన్నారు. ఈ విధంగా వస్తున్న ఫిర్యాదులలో చాలా వరకు తాను అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందన్నారు. గోల్కొండ నుంచి వచ్చిన ఫిర్యాదుపై ఆయన మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో వరదనీటి కోసం భారీ పైప్‌లైన్‌లు జరుగుతున్నాయని, ఈ కారణంగా ఆ ప్రాంతాల ప్రజలకు అసౌకర్యం కలుగుతున్న ప్రజలకు మాట వాస్తవమేనని ఆయన అన్నారు. తాను స్వయంగా ఆ పనులను పరిశీలిస్తున్నానన్నారు. పనులపై అప్పటికప్పుడు తాను అధికారులతో మాట్లాడి పనులు వేగంగా జరిగేలా చూస్తున్నానన్నారు. తాగునీటి సరఫరాపై కూడా తనకు ఫిర్యాదులు వచ్చాయని, లో ప్రెషర్ సమస్య ఎక్కడా కూడా లేదని ఆయన అన్నారు.

కార్వాన్‌లో బీజేపీ బలోపేతం



శక్తి కేంద్రం నాయకులతో బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్ సింగ్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీని అజేయశక్తిగా తయారు చేస్తున్నామని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో కార్వాన్ నియోజకవర్గ యువజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని ఆయన ఆరోపించారు. అసమర్ధ పాలనకు సీఎం కేసీఆర్ నిలువెత్తు నిదర్శమన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పేరున కేసీఆర్ కుటుంబ పాలన జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిని ప్రజలు నేడు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ భారీగా మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్, శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. తీగలగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



ముజీబ్‌ను అభినందిస్తున్న విద్యాశాఖ ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 16న భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేన్ తెలిపారు. గురువారం గన్‌ఫౌండ్రీలోని డీఈఓ కార్యాలయంలో విద్యాశాఖ ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యాశాఖ ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ విభాగం నగర కార్యదర్శి భాస్కర్‌తో పాటు విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న సిబ్బంది

దూద్‌బౌలి: అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-9 టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఇనుకొండ రాణి అన్నారు. గురువారం సర్కిల్ పరిధిలోని లాడ్ బజార్‌లో అక్రమంగా నిర్మించిన ఓ భవనాన్ని కూల్చివేశారు. అక్కడే ఉన్న షట్టర్లను సీజ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఖబూతర్‌ఖానాలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో ఎలాంటి అక్రమ కట్టడాలు నిర్మించినా వెంటనే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైన్‌మెన్ శివా సింగ్, పర్వేజ్, అబ్బాస్ అలీ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోల్కొండలో విద్యార్థుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట ఈ వారంలో మరోసారి పర్యాటకులతో కిటకిటలాడింది. దేశ విదేశాల నుంచి పర్యాకులు కోటలో తిరుగుతూ సుమారు 500 ఏళ్ల చరిత్ర గల కట్టడాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించారు. మరోవైపు నగరం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సైతం కోటలో సందడి చేశారు. కేవలం విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా వేలాది మంది విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి గోల్కొండ కోటకు వచ్చారు. గుంపులుగా వీరు కోటలోని క్లాపింగ్ పోర్టికో, దర్బార్‌హాల్ ప్రదేశాల్లో సందడి చేశారు.

మంగళ్‌హాట్‌లో 'హాత్ సే హాత్ జోడో'



యాత్రలో మెట్టు సాయికుమార్ తదితరులు

అబిడ్స్: మంగళ్‌హాట్ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అప్పర్ ధూల్‌పేట్‌లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ప్రారంభించి ప్రసంగించారు. కాంగ్రె పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్రతో తెలంగాణ నలుమూలలా కాంగ్రెస్ ప్రభంజనం వీస్తుందన్నారు. అంతకు ముందు దివంగత మాజీ ఎమ్మెల్యే శివలాల్ విగ్రహానికి మెట్టు సాయికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సాగర తీరాన నిర్వహించనున్న ఫార్ములా రేస్ నేపథ్యంలో మాసబ్ ట్యాంక్‌లో గురువారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో రాకపోకల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వాటర్ బోర్డులో పాత బకాయిలు ఇప్పించండి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోల్కండ శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్ బోర్డులో పాత బకాయిలు ఇప్పించాలని మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ కాంట్రాక్టర్ల జేఏసీ మీడియా సెల్ ఇన్‌చార్జ్ పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంత్రి కేటీఆర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. వాటర్ బోర్డులో ఎండీ దాన కిశోర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కాంట్రాక్టర్లను రోడ్డుపాలు చేశారని మంత్రికి వివరించారు. ఎన్నో సంవత్సరాల కింద చేసిన పనులకు ఇంత వరకూ డబ్బులు ఇవ్వడం లేదని, తామంతా అప్పులపాలయ్యామని మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగకుండా పాత బకాయిలు ఇప్పించేందుకు కృషి చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



ఉస్మానియాలో రైతును పరామర్శిస్తున్న భట్టి విక్రమార్క తదితరులు

అఫ్జల్‌గంజ్: ఆత్మహత్యకు పాల్పడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు వెంకటేశ్వర్లు (45)ను కాంగ్రెస్ సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురువారం పరామర్శించారు. భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిరకు చెందిన వెంకటేశ్వర్లు బండంగ్‌పేట్‌కు చెందిన ఓ వ్యక్తికి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా అతను తిరిగి ఇవ్వకపోవడంతో విసిగి ఆత్మహత్యకు పాల్పడగా విషయం తెలుసుకున్న బట్టి విక్రమార్క ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి ఉస్మానియా ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఆర్ఎంఓ డాక్టర్ రఫీ వారికి స్వాగతం పలికారు. అనంతరం ఓపీలోని అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్య సేవలందించాలని ఉస్మానియా వైద్య అధికారులను కోరారు.

రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ కార్యాలయాల్లో పర్యటన



అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఎంజేమార్కెట్ రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ కార్యాలయాల్లో టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పర్యటించారు. ఈ కార్యాలయాల్లో ఉద్యోగులంతా ఈనెల 16న నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అన్ని కార్యాలయాల సిబ్బంది, ఉద్యోగులు గగన్‌విహార్‌లోని కార్యాలయానికి వచ్చి రక్తదానం ఇవ్వాలన్నారు. అదేవిధంగా అస్సద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద దాదాపు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, శ్రీధర్, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, ముస్తఫా షరీఫ్, మహ్మద్ వహీద్, శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

మల్లయుద్ధం పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డీకే అరుణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభావంతులైన రెజ్లింగ్ క్రీడాకారులను గుర్తించేందుకు పోటీలను నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముఖేష్‌గౌడ్ మెమోరియల్ మల్లయుద్ధ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలను గురువారం రాత్రి ఎల్బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణప్రాంత క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రేష్ట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ పోటీలు 12వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు అండర్ 15, 17 విభాగాల్లో కుస్తీపోటీలు జరిగాయి.

సుద్దాల అశోక్ తేజకు పురస్కారం ప్రదానం



సుద్దాల అశోక్‌తేజకు పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ రాధారాణి తదితరులు

గన్‌ఫౌండ్రీ: సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ రచనలు నిరాశతో ఉన్న వ్యక్తిని ఉత్తేజ పరిచే విధంగా ఉంటాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో వంశీ ఆర్ట్స్ ఇంటర్నేషనల్, శుభోదయం గ్రూప్‌ల సంయుక్తాధ్వర్యంలో సినీ రచయిత సుద్దాల అశోక్ తేజకు డాక్టర్ కేవీ.రమణ జాతీయ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. కొన్ని గీతాలను విన్నప్పుడు ఆ గీతాలను రచించిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలనే భావన కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారున డాక్టర్ కేవీ.రమణాచారి 71వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రమణాచారి దంపతులను, రచయిత సుద్దాల అశోక్ తేజ దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బి.కృష్ణయ్య, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, వంశీ వ్యవస్థాపకులు వంశీ రామరాజు పాల్గొన్నారు.

న్యూసెన్స్ చేస్తున్న నలుగురికి జైలు

డబీర్‌పురా: బస్తీల్లో తిరుగుతూ స్థానికంగా న్యూసెన్స్ చేస్తున్న ముగ్గురు రౌడీషీటర్లతో పాటు ఓ వ్యక్తికి 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణరావు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. డబీర్‌పురా పోలీసుల వివరాల ప్రకారం.. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబీర్‌పురా బాల్‌శెట్టికేత్ ప్రాంతంలో రౌడీషీటర్లు ఖీజర్ యాకుబి, సయ్యద్ ఇర్ఫాన్ హుస్సేన్, మహ్మద్ తౌసిఫ్‌తో పాటు స్థానికుడు మీర్ మజ్హర్ అలీ స్థానికంగా అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానికులు బస్తీల్లో తిరుగుతూ నూసెన్స్ చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో వారిపై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరు పరచగా నలుగురికి మెజిస్ట్రేట్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

హాజీ అబ్దుల్లా మరణం తీరని లోటు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మౌలానా ముఫ్తీ మహబూబ్ షరీఫ్ నిజామియా తదితరులు

చార్మినార్: ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్ర సేఫ్ అండ్ కంపెనీ యజమాని హాజీ అబ్దుల్లా మరణం ఎంతో మంది పేద ప్రజలకు తీరని లోటని మదర్సా దీనియా రెహమతుల్-ఉల్- ఉలూం అధ్యక్షులు మౌలానా ముఫ్తీ మహబూబ్ షరీఫ్ నిజామియా అన్నారు. ఇటీవల మరణించిన ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ గురువారం పాతబస్తీ మహమూద్‌నగర్‌లో జరిగిన సంతాప సభలో ఆయన పాల్గొని ప్రత్యేక ఖురాన్ పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాజీ అబ్దుల్లా చేసిన సేవలు మరువ లేనివన్నారు. విద్యార్థులు ఆయన బాటలో నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్ సిబ్గతుల్లా షరీఫ్, మౌలానా అబ్రార్ ఖాసీంలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ గ్రంథాలయం స్థలాన్ని పరిరక్షించాలి



గ్రంథాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు

గోల్కొండ: షేక్‌పేట్ గ్రంథాలయం స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని షేక్‌పేట్‌కు చెందిన సారా వెంకటేష్, జి. వేణు గోపాల్, గుర్రం శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు షేక్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రంథాలయ స్థలంలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకుని కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా భవనాన్ని అన్ని హంగులతో నిర్మించి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన వివిధ సంఘాల నాయకులు తదితరులున్నారు.

నల్లపోచమ్మ ఆలయ భూమిని కాపాడండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: మంగళ్‌హాట్‌లోని నల్లపోచమ్మ ఆలయ భూమిని కాపాడాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ వినతి పత్రం అందజేశారు. నవభారత్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నాయకులు ఆలయానికి భూమిని ఇచ్చారని ఆయన వివరించారు. ఆ భూమిపై ఏ రాజకీయ పార్టీ నాయకుడు జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని పార్టీల నాయకులు ఆ భూమిపై కన్నేశారని ఆయన వివరించారు. ప్రజలకు అన్నివిధాల సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నట్లు ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, అనిల్, రాజు, మూర్తి, మనోహర్, శ్రీనివాస్‌యాదవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం



కార్యక్రమంలో కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని కార్వాన్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ అన్నారు. గురువారం కార్వాన్‌లో ఆయన సారథ్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు కొదవలేదన్నారు. బీజేపీతో పాటు బీఆర్‌ఎస్‌లో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు ఉంటూ అధికారం చెలాయిస్తున్నారని, ఆ పార్టీలో ఎవరి కూడా ప్రజల్లో గుర్తింపు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో నిజమైన ప్రజా నాయకులు ఎందరో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రగతి భవన్‌లోనే ఉంటూ నియంతలా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌కు వచ్చే అసెంబ్లీ ఎన్నికలో ప్రజలు గుణపాఠం నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో హమీద్ ఖాన్, చంటిబాబు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కేలండర్ ఆవిష్కరణ, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కేలండర్‌ను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య ఉద్యోగులకు ఈ కేలండర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల ప్రమోషన్లు ఇతర అలవెన్సు విషయంలో అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవింద్‌రెడ్డి నర్సిరెడ్డి, ఆంజనేయులు, తిరుపతిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి భోగ ప్రకాష్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మహాల, రాష్ట్ర నాయకులు అనిల్, హైదరాబాద్ జిల్లా నాయకులు జగత్, మహేష్ సంతోష్, కరీనా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య శాస్త్రి జయంతి



కళాకృష్ణకు పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ రామలింగేశ్వర్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ రంగస్థల నటుడు బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి స్త్రీ ప్రాత అభినయంలో నూతనత్వం తీసుకువచ్చిన సృష్టికర్త అని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఫీజు రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతి శాఖ సౌజన్యంతో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి కళాపీఠం ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య శాస్త్రి 86వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణకు సుబ్రహ్మణ్య శాస్త్రి నృత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతకు ముందు నిర్వహించిన సంగీత నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, విశ్రాంత ప్రొఫెసర్ బీఎస్‌ఎన్ మూర్తి, ఆచార్య భాగవతుల సేతూరామ్, కళాపీఠం అధ్యక్షులు రేవతి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ కేసులో ఏడుగురి అరెస్ట్

చార్మినార్: మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసులో ఆరుగురు నిందితులతో పాటు గ్యాంగ్ రేప్‌కు సహకరించిన మరో మైనర్ బాలికను ఛత్రినాక పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరుగురు యువకులను చంచల్‌గూడ జైలుకు రిమాండ్ తరలించగా.. మైనర్ బాలికను జూవైనల్ హోమ్‌కు తరలించారు. 4వ తేదీన పాతబస్తీలో సంచనలం సృష్టించిన మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసును ఎట్టకేలకు ఛత్రినాక పోలీసులు ఛేదించారు. ఛత్రినాక పోలీసుల వివరాల ప్రకారం ... ఛత్రినాకకు చెందిన రాజ్‌కుమార్ ఆలియాస్ టుంబూకు 16 ఏళ్ల బాలిక స్నేహితురాలు. ఈ బాలిక తన స్నేహితురాలైన మరో మైనర్ బాలికను బర్త్‌డే పార్టీకని బలవంతంగా తీసుకెళ్లింది. స్థానిక మెడికల్ షాపునకు వచ్చిన బాధిత మైనర్ బాలికను నిందితురాలైన మరో మైనర్ బాలిక తన స్నేహితుడైన రాజ్ కుమార్ వద్ద తీసుకెళ్లింది. అక్కడ బాధిత మైనర్ బాలికను ఒక గదిలో వదిలేసి తన స్నేహితుడైన రాజ్‌కుమార్‌తో జతకట్టింది. ఆ గదిలో అప్పటికే ఐదుగురు యువకులు ఉండి.. బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. యువకులు కోరిన విధంగా బాధిత మైనర్ బాలిక సహకరించకపోవడంతో మద్యం కలిపిన కూల్‌డ్రింక్‌ను తాగించి అసభ్యకరంగా ప్రవర్తించారు. రాత్రంతా తనకేం జరిగిందో తెలుసుకోలేని మద్యం మత్తులో జారుకొని ఉదయం లేచి చూసేసరికి అర్ధనగ్నంగా ఉన్నట్లు మైనర్ బాలిక గమనించి విషయాన్ని తన తల్లికి వివరించింది. బాధిత మైనర్ బాలికతో కలిసి తల్లి ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేయగా టుంబూ (18), రాహుల్ (21), నితిన్ ఆలియాస్ చింటూ (19), దీక్షిత్ ఆలియాస్ కాట్లు (19), మల్లేష్ (18), సామ పవన్ (18) యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వెంట తీసుకెళ్లిన మరో మైనర్ బాలికను సైతం అరెస్ట్ చేసి జూవైనల్ హోమ్‌కు తరలించారు. దీనిపై ఛత్రినాక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.